క్లుప్తంగా

29 నుంచి శ్రీరామ నవమి ఉత్సవాలు

పీలేరు రూరల్ : స్థానిక సదుం రోడ్డు మార్గంలోని శ్రీ కల్యాణ సీతారామస్వామి ఆలయంలో ఈ నెల 29 నుంచి రెండు రోజుల పాటు శ్రీరామ నవమి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ కె. రామకృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం సాయంత్రం 6 గంటలకు స్వామి వారికి జలాభిషేకం, రాత్రి 7.30 ధ్వజారోహణం, గణపతి హోమం, సుదర్శన హోమం, శ్రీరామ మూలమంత్ర హోమం, పూర్ణాహుతి నిర్వహించనున్నట్లు తెలిపారు. గురువారం ఉదయం 10 గంటలకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో శ్రీ సీతారాముల కల్యాణోత్సవం, అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే ప్రకాశం రోడ్డులోని కోదండరామస్వామి ఆలయంలో శ్రీరామనవమి ఉత్సవాలు రెండు రోజుల పాటు జరుగుతాయని ఆలయ అర్చకులు ఆనంద శర్మ తెలిపారు.

శ్రీహరికోటకు ప్రత్యేక బస్సులు



మదనపల్లె సిటీ: పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని శ్రీహరికోటలో ఉపగ్రహ ప్రయోగం వీక్షించేందుకు మదనపల్లెకు చెందిన విద్యార్థులు ఆర్టీసీ బస్సుల్లో వెళ్లారు. డిపో -2 నుంచి 20 ప్రత్యేక సర్వీసులలో సుమారు వెయ్యి మంది విద్యార్థులు శ్రీహరికోటకు వెళ్లినట్లు డీఎం ఆర్సీ నిరంజన్ తెలిపారు. అలాగే నేలపట్టు (పక్షుల రక్షిత కేంద్రం)ను కూడా సందర్శించినట్లు తెలిపారు.

'ప్రతాప్‌రెడ్డి సేవలు మరువలేనివి'



సురేష్‌రెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

బి.కొత్తకోట: సింగిల్‌విండో మాజీ చైర్మన్ సుబ్బిరెడ్డిగారి ప్రతాప్‌రెడ్డి సేవలు మరువలేనివని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. గత శుక్రవారం ప్రతాప్‌రెడ్డి మృతి చెందగా ఆదివారం గట్టులోని ఆయన కుటుంబీకులను ఎమ్మెల్యే పరామర్శించారు. తమ్ముడు సురేష్‌రెడ్డి, కుటుంబీకులతో మాట్లాడారు. సింగిల్‌విండో చైర్మన్‌గా రైతులకు, గ్రామపాలనా అధికారిగా ప్రజలకు, వైఎస్సార్‌సీపీ నాయకుడిగా పార్టీకి ప్రతాప్‌రెడ్డి ఎనలేని సేవలు అందించారని కొనియాడారు.

రేపు కన్నెమడుగులో ఎమ్మెల్యే పర్యటన

తంబళ్లపల్లె: మండలంలోని కన్నెమడుగులో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పర్యటిస్తారని సర్పంచు శ్యామలమ్మ ఎంపీటీసీ సభ్యులు మహేష్‌లు ఆదివారం విలేకరులకు తెలిపారు. గడపగడపకు ఎమ్మెల్యే వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకుంటారన్నారు. మండల ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలన్నారు.

సమస్యలను కలసికట్టుగా పరిష్కరించుకుందాం

వాల్మీకిపురం: విశ్రాంత ఉద్యోగుల సమస్యలను మనమందరం కలసికట్టుగా పరిష్కరించుకుందామని విశ్రాంత ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షులు శంకర అన్నారు. ఆదివారం మండలంలోని స్థానిక కొత్తపేటవీధిలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో సమావేశాన్ని నిర్వహించారు. రాబోవు రోజుల్లో మన యూనిట్‌లో ఎవ్వరికీ ఏ సమస్య వచ్చినా ఉమ్మడిగా పోరాటం చేసి సమస్యలను పరిష్కరించుకుందామని సూచించారు. అనంతరం ప్రతి ఒక్కరూ సభ్యత్వ నమోదు చేయించాలన్నారు.

విజయవంతంగా మొక్కల తరలింపు



చెట్టును మరోచోటకు తరలిస్తున్న దృశ్యం

కలికిరి: మొక్కలు నాటి పెంచి పెద్ద చేయడానికి సంవత్సరాలు పడుతుంది. కానీ వాటిని తొలగించడం క్షణాల్లో జరిగిపోతోంది. కలికిరి ప్రాంతంలో ఇటీవల తిరుపతి-మదనపల్లి నాలుగు లైన్ల జాతీయ రహదారి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. రోడ్డు విస్తర్ణలో భాగంగా వందలాదిగా చెట్లను తొలగిస్తున్నారు. అయితే కొన్ని చోట్ల అవసరమైన మొక్కలను మార్పిడి పద్ధతిలో తొలగించిన చోటు నుంచి మరోచోట నాటుతున్నారు. మొదటి సారిగా కొన్ని మొక్కలను ఇలా నాటారు. అవి తిరిగి ప్రాణం పోసుకుని చిగురిస్తుండటంతో హైవే సిబ్బంది రోడ్డు విస్తర్ణలో అడ్డుగా ఉన్న మొక్కలను తొలగించి మరోచోట నాటుతున్నారు. అటుగా వెళుతున్న వాహనదారులు, ప్రయాణికులు వాటిని చూసి హైవే సిబ్బంది కృషిని ప్రశంసిస్తున్నారు.

పంటల రక్షణకు వినూత్న ప్రయోగం



వేరుశనగ పొలం వద్ద రాత్రివేళ విద్యుత్ లైట్లు వెలుగుతున్న దృశ్యం



పొలాల్లో ఎఫ్‌ఎమ్ రేడియోల ఏర్పాటు

- పొలాల్లో విద్యుత్ కాంతులు
- ఎఫ్‌ఎమ్ రేడియోలు, స్పీకర్ల ఏర్పాటు
- తగ్గుతున్న అడవిజంతువుల బెడద

గుర్రంకొండ: ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంటలన్నీ అడవి జంతుల బారినుండి కాపాడుకొనేందుకు రైతులు తొలిసారి విన్నూత్న ప్రయోగాలు చేపట్టారు. పొలం చుట్టూ విద్యుత్‌లైట్లను రాత్రిళ్లు ఏర్పాటు చేసుకొంటున్నారు. మరికొన్ని చోట్ల పొలాల్లో ఎఫ్‌ఎమ్ రెడియోలు, స్పీకర్లను ఏర్పాటు చేసుకొంటున్నారు. దీంతో రాత్రిళ్లు అడవి జంతువుల బారిన నుండి పంటలను కాపాడుకొనేందుకు రైతులు ఏర్పాటు చేసుకొన్న ఇలాంటి పద్ధతులు మంచి ఫలితాలను ఇస్తున్నాయి.

రాత్రిళ్లు పొలాల్లో విద్యుత్ కాంతులు

ప్రస్తుతం రబీసీజన్‌లో రైతులు పలు గ్రామాల్లో వేరుశెనగ పంట సాగు చేశారు. సాధారణంగా గ్రామంలో చాలా మంది రైతులు పంట సాగు చేస్తే అడవి జంతువులు బెడద తక్కువగా ఉంటుంది. అయితే అక్కడక్కడ పంటలు సాగు చేసే రైతులు అడవిజంతువుల బెడదను ఎక్కువ ఎదుర్కొవలసి వస్తోంది. దీంతో ఈ ఏడాది రైతులు వీటి బారినుండి పంటను కాపాడుకొనేందుకు కొత్త ఆలోచనలకు శ్రీకారం చుట్టారు. వేరుశెనగ పంట చుట్టూ స్తంభాలు ఏర్పాటు చేసుకొని విద్యుత్ లైట్లు ఏర్పాటు చేసుకొన్నారు. రాత్రిళ్లు విద్యుత్ కాంతులతో పొలం మొత్తం వెలుతురు ఉండడంతో అడవి జంతువులు అటువైపు వెళ్లడం లేదు. పొలాల్లో విద్యుత్ కాంతులు ఉండడంతొ జన సంచారం ఉంటుందనే భావనతో అడవి జంతువుల బెడద తప్పుతోంది. దీంతో రైతులకు రాత్రిళ్లు పొలాల దగ్గర కాపాలా ఉండడంతో పాటు అడవి జంతువులు రాకుండా రాత్రిళ్లు అరుపులు కేకలు వంటి వాటి నుంచి బయట పడుతున్నారు.

పంటలకు కాపాలాగా ఎఫ్‌ఎమ్ రేడియోలు

కొంతమంది రైతులు కర్భూజాతో పాటు మరికొన్ని పంటల వద్ద అడవి జంతువుల నుంచి పంటలను కాపాడుకోవడానికిగానూ ఎఫ్‌ఎమ్ రేడియోలను ఏర్పాటు చేసుకొంటున్నారు పొలాల వద్ద ఓ చెట్టుకు గానీ, ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకొన్న పందిళ్ల వద్ద ముందుగా రేడియోలను ఏర్పాటు చేసుకొంటున్నారు. దానికి రెండు స్పీకర్లకు కనెక్షన్ ఇస్తున్నారు. ఇవి కరెంటు సౌకర్యం లేకున్నా రాత్రిళ్లు పనిచేయడానికిగాను బ్యాటరీలను ఏర్పాటు చేసుకొంటున్నారు. సాయంకాలం పొలం పనులు ముగించుకొని ఇంటికి వెళ్లే సమయంలో ఎఫ్‌ఎమ్ రెడియోలను ఆన్ చేసి వెళుతున్నారు. దీంతో రాత్రిళ్లు ఎఫ్‌ఎమ్ రెడియోలలో వచ్చే కార్యక్రమాలతో పొలమంతా శబ్దాలు వస్తుంటాయి. దీంతో జనసంచారం ఉంటుందని అడవి జంతువులు పంటలపొలాలవైపు వెళ్లాలంటే భయాందోళన చెందుతున్నాయి. దీంతో రాత్రిళ్లు పంటకు కాపాలా కాచే బాధ నుంచి రైతులు ఉపశమనం పొందుతున్నారు.

ఎస్టీ రిజర్వేషన్లపై హర్షాతిరేకాలు

- బోయలకు ఇచ్చిన మాట నిలుపుకున్న సీఎం
- సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం
- సంబరాలు చేసుకున్న వాల్మీకి బోయలు



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి సంబరాలు చేసుకుంటున్న వాల్మీకి బోయలు

మదనపల్లె : ఏడు దశాబ్దాలకుపైగా వాల్మీకి, బోయలు ఎదురుచూస్తున్న ఎస్టీ రిజర్వేషన్‌పై ఇచ్చిన మాట నిలుపుకున్నందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం స్థానిక చిత్తూరుబస్టాండ్‌లోని వాల్మీకిమహర్షి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించిన వాల్మీకి, బోయలు ఎస్టీ పునరుద్ధరణపై సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. బాణాసంచా పేలుళ్లతో సంబరాలు జరుపుకున్నారు. జై జగన్, జైజై జగన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వాల్మీకి సంఘ నాయకులు మాట్లాడుతూ...ప్రజాసంకల్ప పాదయాత్రలో ప్రతిపక్షనాయకుడి హోదాలో వాల్మీకి,బోయల స్థితిగతులను ప్రత్యక్షంగా గమనించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిరకాల కోరిక నెరవేర్చడమే కాకుండా అండగా ఉంటానని హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం వాల్మీకి, బోయల స్థితిగతులపై అధ్యయనానికి రిటైర్డ్ ఐఏఎస్ శ్యామూల్ ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో ఏకసభ్యకమిషన్‌ను నియమించి, ఆయన అందించిన నివేదిక ఆధారంగా అసెంబ్లీలో కేబినెట్ సమావేశంలో ఎస్టీ జాబితాలో పునరుద్ధరించేందుకు తీర్మానం చేస్తూ కేంద్రానికి పంపడం అభినందనీయమన్నారు. ఈ బిల్లును కేంద్రప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పార్లమెంట్‌లో ఆమోదం తెలిపేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డిలు సహకరించి, న్యాయం చేస్తే జీవితాంతం వాల్మీకి, బోయలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి తోడుగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో వాల్మీకిసంఘం నాయకులు దొడ్డిపల్లె ఆనంద్, బోయవీధి రాధాకృష్ణ, పాకాలహరి, కట్టుబావిచలపతి, పెదరాయుడు నరసింహులు, బసినికొండ చలపతి, శివరాజ్, వెంకటస్వామి, బసప్ప, గంగిరెడ్డి, శంకర, సూరి, కార్తీక్, రాము, కనుగొండశ్రీనివాసులు, వెంకటేష్, మోహన, రమణ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత దాడులు మంచిది కాదు

- కార్యకర్తలకు వైఎస్సార్‌సీపీ నిత్యం అండగా ఉంటుంది
- పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



మాజీ సర్పంచ్ గుర్రప్పను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తదితరులు

కలకడ : కార్యకర్తలకు వైఎస్సార్‌సీపీ నిత్యం అండగా ఉంటుందని, వ్యక్తిగత దాడులకు దిగడం మంచిపద్ధతికాదని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. టీడీపీ నాయకుల చేతిలో గాయపడిన కలకడ మండలం కె.దొడ్డిపల్లె మాజీ సర్పంచ్ గుర్రప్పను ఆదివారం వారి స్వగ్రామంలో పరామర్శించారు. కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా ఉండి న్యాయం కోసం పోరాడాలన్నారు. మనపై దాడిచేసే వ్యక్తుల నుంచి రక్షణ పొందడం, ఐక్యంగా ఉండటం కర్తవ్యకంగా భావించాలన్నారు. మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు గుర్రప్పపై టీడీపీ నాయకులు మూకుమ్మడిగా దాడి చేయడం చూస్తే ప్రజాస్వామ్యంలో ఉన్నామా అనే అనుమానం కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దాడులు చేసే పద్ధతి మంచిదికాదన్నారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి 75 శాతం మంది తిరిగి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే ముఖ్యమంత్రిని చేయాలని సంకల్పంతో ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీదేవి, సింగిల్‌విండో అధ్యక్షులు కమలాకర్‌రెడ్డి, కోన సర్పంచ్ జల్లా రాజగోపాల్ రెడ్డి, మార్కెట్‌కమిటీ చైర్మన్ రవికుమార్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ మోహన్‌రాజ, మండల కోఆప్షన్ సభ్యుడు ఇనాయతుల్లా, ప్రత్యేక ఆహ్వానితులు జీవి కిషోర్, హరినాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మధుసూదన్‌రెడ్డి, గోవర్ధన్, కుమార్‌నాయుడు, కుమార్‌రెడ్డి, రమణ, పురుషోత్తం, శ్రీనివాసులురెడ్డి, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు అభివృద్ధికి సహకరించండి

టౌన్ బ్యాంక్ పర్సన్ ఇన్‌చార్జి శ్యామ్‌ప్రకాష్‌రెడ్డి



మాట్లాడుతున్న పర్సన్ ఇన్‌చార్జి శ్యామ్‌ప్రకాష్ రెడ్డి, సీఈఓ ప్రసాద్

మదనపల్లె : మదనపల్లె కో–ఆపరేటివ్ టౌన్ బ్యాంక్‌లో రుణాలు తీసుకుని గడువు మీరిన ఖాతాదారులందరూ ప్రతినెలా సక్రమంగా కంతులు చెల్లించి బ్యాంకు అభివృద్ధికి సహకరించాలని పర్సన్ ఇన్‌చార్జ్, డివిజనల్ కో–ఆపరేటివ్ అధికారి శ్యామ్‌ప్రకాష్ రెడ్డి కోరారు. టౌన్‌బ్యాంక్ 2022–23 సంవత్సరపు రెండో సాధారణ మహాజన సభ సమావేశం ఆదివారం బ్యాంకు ప్రధాన కార్యాలయంలో జరిగింది. సీఈఓ పి.వి.ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పర్సన్ ఇన్‌చార్జ్ శ్యామ్‌ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ 28–2–2023 నాటికి బ్యాంకు డిపాజిట్లు 86.25 కోట్లు అయితే, సభ్యుల నుంచి రావాల్సిన అప్పులు 61.23 కోట్లుగా, బ్యాంకు సొంత నిధులు రూ.9.38 కోట్లు ఉందన్నారు. బ్యాంక్ డిపాజిట్లుకు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన డిపాజిట్ ఇన్సూరెన్స్, క్రెడిట్ గ్యారంటీ కార్పొరేషన్‌లో బ్యాంక్ రెగ్యులేషన్ యాక్ట్ ప్రకారం బీమా సౌకర్యం కలదన్నారు. పట్టణంలోని వ్యాపారస్తులకు వినూత్నంగా బంగారు నగల తాకట్టుపై 100 నుంచి 400 రోజుల వ్యవధితో రూ.25లక్షల వరకు డైలీలోన్ సదుపాయం కల్పిస్తున్నామన్నారు. ది మదనపల్లె కో–ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ జూన్ 24, 2023 నాటికి ఖాతాదారుల సేవలో 99 ఏళ్లు పూర్తిచేసుకుని 100వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్నందుకు సంతోషంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్లు సుధారాణి, జయచంద్రనాయుడు, రవిచంద్రారెడ్డి, రాధిక, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు



విన్నర్స్‌గా నిలిచిన జిల్లా సీనియర్ బాలికల జట్టు,



ట్రోఫీ అందుకుంటున్న విన్నర్స్ జిల్లా సీనియర్ బాలుర జట్టు

మదనపల్లె సిటీ: క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రెడ్డన్నశెట్టి అన్నారు. ఆదివారం మదనపల్లె సమీపంలోని ఆరోగ్యవరంలో 6వ అండర్– 14,–17, సీనియర్ బాల,బాలికల అంతర్ జిల్లా మిని ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్–2023 విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. ప్రతిభగల క్రీడాకారులను పీడీలు ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ధాత్రి ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఎస్.స్వాతి, పీడీలు రామ,సుధాకర్, సైమన్, భాను,శరత్ ,న్యాసీ తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

అండర్–14 బాలుర విభాగంలో విన్నర్స్ అన్నయయ్య జిల్లా, రన్నర్స్ క్రిష్ణా, మూడవ స్థానం వైజాగ్, అండర్–17 బాలుర విభాగంలో విన్నర్స్ అన్నమయ్య, రన్నర్స్ కడప, మూడవ స్థానం కర్నూలు నిలిచింది. సీనియర్ విభాగం బాలురలో విన్నర్స్ అన్నమయ్య, రన్నర్స్ కడప, మూడవ స్థానం క్రిష్ణా, బాలుర విభాగంలో విన్నర్స్ అన్నమయ్య, మూడవ స్థానం గుంటూరు నిలిచింది.

వంక పొరంబోకులో అక్రమ నిర్మాణం తొలగింపు



కురవంకలో అక్రమ కల్వర్ట్ నిర్మాణాన్ని తొలగించిన రెవెన్యూ అధికారులు

మదనపల్లె : పట్టణ మున్సిపల్ సరిహద్దు, పొన్నూటిపాళ్యం పంచాయతీలోని కురవంక పొరంబోకు స్థలంలో అక్రమంగా కొందరు రియల్టర్‌లు నిర్మిస్తున్న పైప్‌లైన్ కల్వర్ట్‌ను తొలగించినట్లు తహసీల్దార్ సీకే.శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... పొన్నూటిపాళ్యం సర్వే నెం.490 వంక పొరంబోకు స్థలంలో కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు అనుమతి లేకుండా కల్వర్టు నిర్మిస్తున్నట్లు స్థానికులు ఫిర్యాదు చేశారన్నారు. క్షేత్రస్థాయిలో వెళ్లి పరిశీలిస్తే కల్వర్ట్ నిర్మాణానికి వంకలో సిమెంట్ పైప్‌లు దింపి పనులు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిసిందన్నారు. దీంతో జేసీబీ సహాయంతో ఆదివారం వేకువజామున వాటిని తొలగించినట్లు చెప్పారు. ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల అనుమతి లేకుండా కురవంకలో ఎలాంటి నిర్మాణాలు జరపరాదని, నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

బీజేపీని అడుగడుగునా అడ్డుకుంటాం

తంబళ్లపల్లె: బీజేపీ ఇచ్చిన మాటను తుంగలో తొక్కి ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత కల్పించకపోవడంతో ఆగ్రహానికి గురైన మాదిగలూ బీజేపీ పార్టీని అడ్డుకుంటామని ఎమ్మార్పీస్ నాయకులు దుమ్ము చిన్న, మల్లికార్జున, ఎర్రప్పలు హెచ్చరించారు. ఆదివారం మందక్రిష్ణ మాదిగ పిలుపు మేరకు చేపట్టిన మాదిగల సంగ్రామ పాదయాత్ర తంబళ్లపల్లెకు చేరుకుంది.

సేవా కార్యక్రమాలను విస్తృతం చేద్దాం

– జిల్లా మానవత సంస్థ అధ్యక్షుడు క్రిష్ణమూర్తి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు క్రిష్ణమూర్తి

వాల్మీకిపురం: సమాజంలోని నిరుపేద ప్రజలను ఆదుకునేందుకే మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అందిస్తున్న సేవలను మరింత విస్తృతం చేద్దామని ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు క్రిష్ణమూర్తి అన్నారు. ఆదివారం స్థానిక భగవాన్ సత్యసాయి మందిరంలో మానవత సంస్థ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలను ఆదుకునేందుకు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. మానవుడిగా మన జీవితానికి పరిపూర్ణత చేకూరాలంటే కుటుంబం, స్వార్థం కాకుండా సమాజం కోసం సేవ చేయాల్సిన ధర్మ ఉందన్నారు. ఇప్పటికే ఫ్రీజర్ బాక్సులు, వైకుంఠ రథం, రోడ్డు పక్కన బల్లలు ఏర్పాటు చేశామన్నారు. పచ్చదనం కార్యక్రమం కింద మొక్కలను నాటే కార్యక్రమాలను చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కేశవ రెడ్డి, నీళ్లభాస్కర, రమణమూర్తి, శంకర, రామక్రిష్ణారెడ్డి, పివి నారాయణ, ఆనంద శెట్టి, సారధి, తదితరులు పాల్గొన్నారు.

బీటెక్ వారికి త్రివిధ దళాల్లో ఉద్యోగావకాశాలు

– లెఫ్టినెంట్ కల్నల్ రంగనాధన్



మాట్లాడుతున్న లెఫ్టినెంట్ కల్నల్ రంగనాధన్

కురబలకోట: బీటెక్ పాసైన వారికి త్రివిధ దళాల్లో భారీగా ఉద్యోగాలు అవకాశాలు ఉన్నాయని 35వ ఆంధ్రా బెటాలియన్ చిత్తూరు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ రంగనాధన్ పేర్కొన్నారు. మదనపల్లె దగ్గర అంగళ్లలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం 'గ్రాడ్యుయేట్స్ కేరీర్ ఆపర్చునిటీస్ ఇన్ ఇండియన్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్' అంశంపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. దేశ రక్షణలో ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్సు త్రివిధ దళాలు వెన్నెముకగా నిలుస్తున్నాయన్నారు. యువతకు ఆశాజనకంగా ఉద్యోగాలు ఉన్నాయన్నారు. ఎన్‌సీసీ క్యాడెట్‌గా ఉన్న ఇంజినీరింగ్ విద్యార్థులకు ఇందులో ఉద్యోగాలు మరీ ఎక్కువగా ఉన్నాయన్నారు. శిక్షణ సమయంలోనే రూ.56 వేలకు పైగా స్టైఫండ్ అందజేస్తారన్నారు. దేశ చేయాలనే వారికి ఇదొక సువర్ణ అవకాశమన్నారు.

హనీఫ్ సేవలు ప్రశంసనీయం



షేక్ అనీఫ్‌ను సన్మానిస్తున్న ప్రజా చైతన్యస్రవంతి సభ్యులు

మదనపల్లె సిటీ: యువ మైనార్టీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు షేక్ హనీఫ్ సేవలు ప్రశంసనీయమని ప్రజా చైతన్య స్రవంతి అధ్యక్షులు గొల్లపూడి తిరుపతిరావు అన్నారు. ఆదివారం స్థానిక ప్రశాంత్‌నగర్‌లోని జ్ఞానోదయ పాఠశాలలో షేక్‌హనీఫ్‌కు సన్మాన కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ కోవిడ్ కాలంలో కలికిరి పరిసర ప్రాంతాల్లో అనేక సామాజిక సేవ కార్యక్రమాలు చేశారని తెలిపారు. ముఖ్యంగా కోవిడ్‌తో మృతి చెందిన పార్థివదేహాలను సంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు చేశారని గుర్తు చేశారు. అనంతరం శాలువకప్పి మెమోంటో అందజేశారు. కార్యక్రమంలో తెలుగు అధికార భాషా సంఘం మాజీ అధ్యక్షులు వేంపల్లి షరీఫ్, నవలా రచయితల టీ.ఎస్.ఏ.కృష్ణమూర్తి, లైబ్రేరియన్ వసంతకుమారి, రచయితలు వాసా కృష్ణమూర్తి, శ్రీనివాసులు, మునిగోపాలకృష్ణ, ధనలక్ష్మి, ప్రభాకర్, సభాపతి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం



స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

వాల్మీకిపురం: వాల్మీకిపురం పడమర పొలిమేర ధర్మపథంలో వెలసిన శ్రీ కార్యసిద్ధి అభయాంజనేయస్వామి దేవాలయంలో ఆదివారం కృత్తికా నక్షత్రంను పురస్కరించుకొని శ్రీ వల్లిదేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుబ్రహ్మణ్యస్వామికి అర్చన, పంచామృతాభిషేకం, తోమాలసేవ తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో సుబ్రహ్మణ్యస్వామి, వల్లిదేవసేనకు రక్షాబంధనం, బాసింగధారణ, మంగళ్యధారణ, తలంబ్రాల సమర్పణ తదితర కార్యక్రమాల అనంతరం స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీచౌడేశ్వరిదేవి గ్రామోత్సవం



జ్యోతులకు పూజలు చేస్తున్న భక్తులు

కలకడ : మండలంలోని గుడిబండ గ్రామదేవత శ్రీచౌడేశ్వరిదేవి అమ్మవారు ఇంటింటి పూజలు అందుకున్నారు. తొగటవీరక్షత్రియులు అలంకరించిన చాందినీ బండిలోని సింహవాహనంపై గుడిబండ గ్రామ పురవీధులలో అమ్మవారిని ఊరేగించారు. తొగటవీరక్షత్రియులు పలికిన ఖడ్గపద్యాలతో, భళ్లారి డ్రమ్స్ , కీలుగుర్రాలు, చక్కభజనలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అమ్మవారి రథం ముందు తొగటవీరక్షత్రియులు ఉపవాసంతో తయారు చేసిన పవిత్ర జ్యోతులు పూజలు అందుకోగా నీటి దారతో స్వాగతం పలికారు. లంకా దహనం అయిన అనంతరం ఆలయం ముందు ఏర్పాటు చేసిన అగ్నిగుండంలో జ్యోతులతో భక్తులు దిగారు. ప్రత్యేక పూజలు చేసిన భక్తులు అమ్మవారి రథం వెంటనడిచారు.

ఓటరుకు ఆధార్ అనుసంధానం తప్పనిసరి



ఆధార్ అనుసంధాన కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గోపాలకృష్ణ

పీలేరు రూరల్ : ప్రతి ఓటరుకు ఆధార్ అనుసంధానం తప్పనిసరని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె. గోపాలకృష్ణ అన్నారు. ఆదివారం పీలేరు పట్టణంలోని అన్ని పోలింగ్ బూతుల పరిధిలో ఓటరుకు ఆధార్ అనుసందానం ప్రక్రియ చురుగ్గా చేపట్టారు. కార్యక్రమాన్ని పరిశీలించిన ఆయన మాట్లాడుతూ మండలంలో 59,287 ఓటర్లు ఉండగా, ఇప్పటి 48,057 ఓటర్లుకు ఆధార్ అనుసందానం పూర్తి చేసినట్లు తెలిపారు. ఇంకా 11,200 ఓటర్లకు ఆధార్ అనుసంధానం చేయాల్సి ఉందన్నారు. ఈ నెలాఖరు లోపు పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవి, ఎన్నికల డీటీ కిరణ్, ఆర్ఐ రాజశేఖర్, వీఆర్వోలు, బూత్ లెవెల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

మొబైల్ వెటర్నరీ క్లినిక్‌ను సద్వినియోగం చేసుకోవాలి



పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

కేవీపల్లె : మొబైల్ వెటర్నరీ క్లినిక్‌ను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి డాక్టర్ ప్రియాంక అన్నారు. ఆదివారం మండలంలోని గ్యారంపల్లె కొత్తపల్లెలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి వచ్చే అవకాశం ఉందని, ముందస్తుగా టీకాలు వేపించుకోవాలని కోరారు. ఇంటి వద్దకే పవువైద్య సేవలు అందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ పథకం తీసుకొచ్చిందని తెలిపారు. పశువులకు వైద్య సేవలు పొందడానికి టోల్ ఫ్రీ నెంబర్ 1962ను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పశు సహాయకులు పవన్‌కుమార్, గోపాలమిత్ర శ్రీనివాసులునాయుడు, తాతయ్య తదితరులు పాల్గొన్నారు.

రెడ్డెమ్మకొండపై భక్తుల రద్దీ



గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. ఈసందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునే అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సంతానం కోసం మహిళలు ఆలయపరిసరాల్లోని కోనేట్లో స్నానమాచరించి అమ్మవారి ఎదుట వరపడ్డారు. భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించి పూజలు నిర్వహించుకొన్నారు. పలువురు భక్తులు ఆలయంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. హిందువులతో పాటు మస్లీంలు పెద్ద ఎత్తున ఆలయానికి తరలివచ్చి అమ్మవారికి పూజలు నిర్వహించడం గమనార్హం.